**కథ**

# ఇదేన్యాయం!

"ఏమండీ! మన రవి ఏమంటున్నాడో విన్నారా?''

పేపర్లో తలదూర్చి బయట ప్రపంచంతో సంబంధం కోల్పోయిన భర్తని గట్టిగా కుదిపింది విశాల.

"అరే! రవి ఏమన్నాడో చెప్పకుండా-విన్నారా అంటే ఏం చెప్పను'' స్వరం పైకి వచ్చింది కానీ, రఘురామయ్య తలమాత్రం ఇంకా పైకి లేవలేదు.

"అబ్బబ్బ! ఛస్తున్నాను బాబూ ఈయనతో. ప్రపంచం తలక్రిందుల యినా సరే, పేపరు పట్టుకుంటే మిగతావేవీ పట్టవీయనకు.''

"ప్రపంచ విశేషాల కోరకే కదా విశాలా, పేపరు చదివేది. ఇంతకీ అసలు విషయం చెప్ప కుండా ఏంటీ నిందలు''' రఘురామయ్య పేపరు ప్రక్కన పడేసి భార్యవేపు తిరిగాడు.

విశాల ముఖం కోపంతో-ఆవేదనతో ఉద్వి గ్నమవడం గమనించాడు.

"ఏంటి విశాలా! రవి ఏమన్నా డేంటి?'' అనునయంగా భార్యకేసి చూశాడు.

"తనుకూడా వెళ్తాడండీ!''

"ఎక్కడికి..వాళ్ళ అత్తగారిం టికా?''

"అయ్యోరామా! వాళ్ళ అత్తగారింటికయితే నాకింత బాధ ఎందుకు?''

"మరి ఎక్కడికో త్వరగా చెప్పు. నేను మళ్ళీ బ్యాంక్‌కి వెళ్ళాలి''

"అదేనండీ! రవి ఈమధ్య కంప్యూటర్ క్లాస్‌కి వెళ్తున్నాడు కదా!''

"వెళ్ళనీవోయ్! దానికి నీకెందుకు మధ్యలో బాధ?''

"నన్ను పూర్తిగా చెప్పనిస్తారా..లేదా!'' కొంచెం కోపంగానే అంది విశాల.

"ఓకే. ఓకే. చెప్పు''

"రవి ఫ్రెండ్ అనూప్ - ఆమధ్య కాలిఫోర్ని యాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఒకటి స్టార్ట్ చేశాడు కదా! తనకి సహాయంగా అమెరికా వచ్చి ఎం.డి.గా అందులో చేరమని తొందరపెడ్తు న్నాడు!''

"ఔను. చెప్పాడు. నిజంగా వెళ్ళాలన్న ఉద్దేశం, రవి కుందంటావా?''

"భలేవారే! అనూప్‌కి తన అంగీకారం తెలి యజేశాడట రవి. వెళ్ళిపోయేందుకు పేపర్స్ అవీ తయారు చేసుకు టున్నాడు. ప్రొద్దున మళ్ళీ ఈ ప్రస్తావన వచ్చి నువ్వుకూడా వెళ్ళిపో తావా రవీ!'' అని నేనంటే వాడేమన్నాడో తెల్సా?''

"ఏమన్నాడేంటి!?''

"ఏమ్మా! నాకు అమెరికా వెళ్ళి ఉద్యోగం చేసే యోగ్యతా, అర్హతా లేవంటావా?'' అంటూ నాకే ఎదురు ప్రశ్న వేశాడు. అప్పటి నుండి నాకు గుండెలో రాయి పడిందంటే నమ్మండి'' దాదాపు కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ

మాట్లాడుతున్న విశాలని చూస్తే, రఘురామ య్యకి కొంత జాలి, మరింత చిరాకు కల్గింది.

"సరేలే! ఆ విషయం తర్వాత ఆలోచిద్దాం. నేను బ్యాంకుకు వెళుతున్నాను. దార్లో ఏవైనా సరుకులు కావాలంటే చెప్పు, వచ్చేటప్పుడు తీసుకొస్తాను'' అన్నాడు అక్కడనుండి లేస్తూ.

"ఏం అక్కరలేదులెండి'' విసురుగా లోపలి కెళ్ళిపోయింది విశాల.

గాఢంగా నిట్టూర్చి, రఘురామయ్య మళ్ళీ వాలు కుర్చీలో కూచుండిపోయాడు.

వారం రోజుల క్రితం, యధాలాపంగానే అయినా రవి తన స్టేట్స్ జాబ్ విషయం తండ్రితో ప్రస్తావించినపుడు, రవిని వెళ్ళొద్దని అనలేదు రఘురామయ్య.

కారణం..?

పదేళ్ళక్రితం ఇండియాలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన రవి, ఎం.ఎస్ చదవడానికి అమెరికా వెళ్ళాడు. చదువు పూర్తయ్యాక, అక్కడే మంచి ఉద్యోగం కూడా వచ్చింది. ఆ సమయంలోనే రఘురామయ్య పనిచేసే కంపెనీ వాళ్ళు, వి.ఆర్.ఎస్. అమలు చేసి ఉద్యోగస్తులను తగ్గిం చారు. అందులో రఘురామయ్య కూడా ఒకరు.

ఇంజనీరింగ్ ఆఖరు సంవత్సరంలో వున్న తమ్ముడు వివేక్, చదువులు ఇంకా పూర్తిగాని ఇద్దరు చెల్లెళ్ళూ, రిటైరైన తండ్రిని దృష్టిలో పెట్టుకొని, ఇండియాకి తిరిగి వచ్చి ఇక్కడే ఓ మంచి కంపెనీలో చేరిపోయాడు రవి. ఈ లోగా తమ్ముడు వివేక్ ఇంజినీరింగ్ పాసయి, ఆస్ట్రేలి యాలో ఎం.ఎస్. చేయడానికి వెళ్ళడం కూడా జరిగింది.

తమ్ముడి చదువు విషయంలో కానీ, చెల్లెళ్ళ చదువులూ, వాళ్ళ పెళ్ళిళ్ళ బాధ్యతలలో కానీ రవి, తండ్రికి కుడిభుజమై వుండి, కుటుంబా నికి అన్నివిధాలా ఆసరా అయ్యాడు. పెద్ద మన సుతో రవి వాడి విదేశీ అవకాశాలు కూడా వదు లుకొని, తనకి ఎంతో ఊరటని, మనశ్శాంతిని కల్గించిన సంగతి రఘురామయ్య ఏనాడూ మర చిపోలేదు.

తర్వాత చోటుచేసుకున్న పరిణా మాలే-ఇంట్లో కొంత కలవరానికి కారణమ య్యాయి. ఆస్ట్రేలియాలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వివేక్, స్టేట్స్ నుండి మంచి ఆఫర్ వచ్చిందని అటునుండి-అటే వెళ్ళిపోయాడు టెక్సాస్. వారం రోజుల వ్యవధిలో జరిగిన చెల్లెళ్ళ పెళ్ళికి చుట్టపు చూపుగా ఇండియా వచ్చిన వివేక్, తన పెళ్ళి కూడా సెటిల్ చేసుకొని. ఎం.సి.ఏ. చదివిన రాగిణిని పెండ్లాడి, తుర్రుమ న్నాడు భార్యతో సహా తన భూతల స్వర్గానికి!

పదేళ్ళలో ఎన్నో మార్పులు! రవి కంపెనీ వాళ్ళు మంచి జీతమే ఇస్తారు. అయినా వెంట వెంటనే ఇద్దరు మగపిల్లలు-అఖిల్, నిఖిల్ పుట్టడం, వాళ్ళ స్కూల్ అడ్మిషన్లు, మధ్యలో ఆడపిల్లల రాకపోకలు, వాళ్ళకి మర్యాదలూ, పురుళ్ళూ-ఇలా అతని సంపాదన అంతా ఇంటికే ఖర్చు అయ్యేది.

రఘురామయ్యగారు బ్యాంకులో వేసిన డబ్బుతో వచ్చే వడ్డీ, 'వేన్నీళ్ళకి చన్నీళ్ళు తోడు' అన్నట్లుండేది. తరుము కొచ్చే వయసుకు జోడింపు అన్నట్లు- వచ్చేరోగాలు, వాటిని అదు పులో పెట్టేందుకు ఖరీదయిన మందులూ సరే సరి.

వివేక్ దగ్గరి నుండి ఏనాడు ఎటువంటి ఆర్థిక సహాయం వీళ్ళు ఆశించలేదు. రెండేళ్ళ కొక మారు చుట్టపు చూపుగా రావడం, వచ్చినప్పటి నుండీ తమ ఛార్జీలకయిన ఖర్చుల గురించి ఏక రవు పెట్టడం, వచ్చినంత వేగంగా ఉరుకులు పరుగులు పెట్టి తిరిగి వెళ్ళడం- వాడికి బాగా అలవాటైపోయింది. కాకపోతే ఆ వచ్చినప్పుడు మాత్రం అందరికీ ఏవో గిఫ్ట్లు తెచ్చి అందరినీ అలరించి మరీ వెళ్ళేవాడు.

ఈ తడవ వచ్చినప్పుడు మాత్రం వివేక్ ఓ నెల రోజులున్నాడు. భార్య రాగిణి చాలావరకు పుట్టింట్లోనే గడిపింది. 'బొంబాయిలో

అన్నయ్య ఇంటికి, డార్జిలింగ్‌లో వున్న అక్కయ్య దగ్గరికి' అంటూ కూతురు ప్రీతిని, కొడుకు నిమిష్‌ని వెంట పెట్టుకొని బయలుదేరింది. వివేక్ మాత్రం హైదరాబాద్‌లో వుండిపోయాడు, ఏవో పనులున్నాయంటూ.

వివేక్, రాగిణి, పిల్లలు వున్నన్ని రోజులూ-ఇంట్లో ఒకటే సందడి. ఎన్నో రోజులకు వచ్చే అన్నయ్యని చూడాలంటూ వచ్చే చెల్లెళ్లు, వాళ్ళ భర్తలు పిల్లలూ సరేసరి. ఇల్లు పెళ్లి పందిరే అయ్యేది. వివేక్ అన్నయ్య తెచ్చే చీరలు చిన్న చిన్న గిఫ్ట్స్ అపురూపం చెల్లెళ్ళకి. ''అన్నయ్య తెచ్చాడు-మా వివేక్ అన్నయ్య తెచ్చాడు'' అంటూ మురిసిపోయేవారు.


రవి భార్య శాంతి పేరుకు తగ్గట్లు శాంత స్వభావురాలు. ఇంటి పచాకిరీ చిరునవ్వుతో చేస్తూ అందరినీ ఆప్యాయంగా చూసుకునేది. ''పిల్లలు ప్రీతీ, నిమిష్‌కు ఇక్కడి నీళ్ళు సరిపడవు. ఈ భోజనం వాళ్ళకి అలవాటు లేదంటూ'' రాగిణి తన పిల్లలిద్దర్నీ ప్రత్యేకంగా చూడడం, శాంతి పిల్లలయిన నిఖిల్, అఖిల్‌కు అర్థమయ్యేది కాదు. ప్రీతీ, నిమిష్‌లకి పెట్టేదే తమకీ కావాలని పేచీ పెట్టేవారు. విశాల కూడా రాగిణినే సపోర్ట్ చేస్తూ, రవి పిల్లల్ని కేకలేయడం, రఘురామయ్య ఎన్నోసార్లు గమనించాడు. ప్రీతిని, నిమిష్‌ని, స్పెషల్ గెస్ట్‌ల కింద చూడడం, శాంతికేం బాగానీ, రవికి చికాకు తెప్పించేది. కానీ, ఏవో నాలుగు రోజులుండిపోయేవారితో గొడవెందుకు లెమ్మని సర్దుకుపోయేవాడు. ఇవన్నీ సామాన్య విషయాలే అన్నట్లు రఘురామయ్య పట్టించుకునేవాడు కాదు.

కానీ మొన్నటికిమొన్న రవీ, రాఘురామయ్య వరండాలో కూచుని ఉండగా వివేక్ చేసిన ప్రపోజల్ రఘురామయ్యని చాలా కలవరపరిచింది. ఆనాటి సంఘటన రఘురామయ్య కళ్ళముందు ప్రత్యక్షమయింది.

''నాన్నా! నేను స్టేట్స్‌కి వెళ్ళేలోగా మన మేడ మీద నాల్గు గదులు వేయాలనుకుంటున్నాను'' అన్నాడు వివేక్, ఉరుము లేని పిడుగులాగా.

''ఇప్పుడేమంత అవసరమొచ్చిందిరా. మనకీ ఇల్లు సరిపోతూందిగా!'' అన్నాడు రఘురామయ్య.

'ఇదేంటి ప్రస్తావన ఇంత సడన్‌గా మొదలెట్టాడు!' అన్నట్లు చూశాడు రవి, తమ్ముడుకేసి.



''మీకు సరిపోతుంది సరే. మేము వచ్చినప్పుడు మాకు చాలా ఇబ్బందిగా వుంటోంది నాన్నా! అక్కడ సుఖాలకి అలవాటుపడ్డ పిల్లలు కదా, ఇక్కడ చాలా అనీజీగా ఫీల్ అవుతున్నారు. రాగిణి కూడా ఎప్పుడు ఇండియా వెళ్దామన్నా- ''అబ్బ! ఆ వేడిలో, ఆ దుమ్ములో నేనుండలేను బాబూ! పిల్లలు కూడా నలిగిపోతారు'' అంటూ ఇక్కడికి రావడానికి ఇష్టపడడం లేదు. అదే పైన నాల్గు రూములేసి, ఏ.సి. చేయిస్తే, మేమొచ్చినప్పుడు సదుపాయంగా వుంటుంది.''

వివేక్ మాటలకు ఆశ్చర్యపోయాడు రవి.

''అదేంట్రా నువ్వు లాస్ట్ టైం వచ్చినప్పుడు మహేంద్రా హిల్స్‌లో కట్టించిన పెద్ద ఇల్లు వుంది కదా! నీకిక్కడ సౌకర్యం లేకుంటే అక్కడే వుండొచ్చు కదా'' అన్నాడు రఘురామయ్య.

''అదా! ఆ ఇల్లు నెలకు పాతిక వేల రూపాయలకు, ఫోర్ ఇయర్స్ లీజ్‌కి ఇచ్చేసాను నాన్నా'' అన్నాడు వివేక్, తాపీగా.

''అలాగా సరే! నీ ప్రపోజల్ కూడా బాగానే వుందిలే. రవి పిల్లలు అఖిల్, నిఖిల్ కూడా పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్ళ స్టడీకి సపరేట్ రూం అంటూ ఏర్పడుతుంది'' అన్నాడు రఘురామయ్య సంతోషంగా.

''అలా ఎలా కుదురుతుంది నాన్నా! మేడ మీద భాగం నావాటా క్రిందకి వస్తుంది కదా! నా ఖర్చుతోనే రూములు వేసుకుంటాను. ఆ పోర్షన్-ఖాళీగా అట్టేపెడితే మంచిది. మళ్ళీ మేమొచ్చినప్పుడు కష్టం కదా!''

నిష్కర్షగా మాట్లాడుతున్న వివేక్ మాటలకు నివ్వెరపోయాడు రఘురామయ్య.

'స్వార్థానికి పరాకాష్ఠ అంటే ఇదే కాబోలు. అమెరికన్ డాలర్లతో తను దర్జాగా, అన్ని సౌకర్యాలతో కట్టించుకున్న ఇల్లు అద్దెకు ఇచ్చుకున్న పెద్ద మనిషి, ఇప్పుడు తండ్రి ఆస్తిలో వాటా కోసం ఎంత ఖరాఖండీగా అడుగుతున్నాడు' మనసులోని మాటను బయటకు అనలేక మౌనంగా ఉండిపోయాడు రవి.

రఘురామయ్య అంతరంగం అతలాకుతలమయిపోయింది. తన కడుపున పుట్టిన ఇద్దరు కొడుకుల్లో ఎంత తారతమ్యం! స్వార్థరహితంగా కుటుంబ బాధ్యతలను నెత్తికెక్కించుకున్నాడు పెద్దవాడు. అందుకు తగ్గ ప్రతిఫలం వాడికి లభించిందా ఈనాడు? ఆఖరికి కన్నతల్లి కూడా రవి అమెరికా వెళ్తానని అంటే అదేదో అపరాధం క్రింద భావిస్తోంది. ఇక బంధువర్గాలలో సరేసరి- వివేక్ అంటే హీరోవర్షిప్.

చెల్లెళ్ళిద్దరికీ ఇంత చేసిన రవి అన్నయ్య కాదు, వివేక్ అన్నయ్యే వరాలిచ్చే దేవుడు. ఇదెక్కడి న్యాయం? పోనీ ఇన్నాళ్ళూ తనూ, తన భార్య ఏం చేశారు? ఉమ్మడి సంసార బాధ్యతలన్నీ పెద్దకొడుకైన రవిపై వేసి, పెద్దపీట మాత్రం ఎప్పుడూ చిన్నవాడికే వేస్తూ వస్తున్నారు. వివేక్‌కి ఏమాత్రం తీసిపోని ప్రజ్ఞ ఉన్న రవిని, వాడి భవిష్యత్తుని ఫణంగా పెట్టి, వృద్ధులయిన తమకోసం ఇక్కడేవుండి పొమ్మనడం అవివేకమే కాదు, స్వార్థం కూడా అవుతుంది.

అందుకే విశాలని ఒప్పించి, రవి కోరికను మన్నించి, వాడు అమెరికా వెళ్ళిపోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు రఘురామయ్య. అదే న్యాయం అనుకున్నాడాయన.

*

ఎమ్. హేమలత